సాక్షి నిజామాబాద్

మంగళవారం ; 22 ; ఆగస్టు ; 2023



'లక్కు' చిక్కింది

జిల్లాలో వైన్‌షాపులకు సోమవారం లక్కీ డ్రా నిర్వహించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు డ్రాతీసి విజేతలను ప్రకటించారు.

- 8లో ▸



కోనాపూర్‌తో పేగుబంధం

సీఎం కేసీఆర్‌కు కామారెడ్డి జిల్లాలోని కోనాపూర్‌తో ప్రత్యేక అనుబంధం ఉంది. అయన అమ్మ పుట్టి పెరిగిందిక్కడే.

- 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
30.2 /23.2

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఎండతీవ్రత ఉంటుంది. సాయంత్రం మేఘావృతమై చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

కామారెడ్డి బరిలో.. దళపతి

- ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించిన సీఎం కేసీఆర్
- కామారెడ్డి అసెంబ్లీ స్థానం నుంచి స్వయంగా పోటీ
- సిట్టింగులకే మూడోసారి అవకాశం
- మొదలైన ఎన్నికల వేడి



అధికార పార్టీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపుపై ఉత్కంఠ వీడింది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాక ముందే అధినేత కేసీఆర్ అభ్యర్థుల ప్రకటన చేశారు. దీంతో ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచారానికి నగారా మోగించారు. ముందు నుంచి చెబుతున్న విధంగా సిట్టింగ్‌లకే మరో అవకాశం కల్పించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సిట్టింగులందరికీ వరుసగా మూడోసారి అవకాశమిచ్చారు. కామారెడ్డిలో మాత్రం నేరుగా కేసీఆర్ బరిలోకి దిగుతున్నారు. ఏకంగా పూర్తిస్థాయిలో అభ్యర్థుల ప్రకటన నేపథ్యంలో ప్రత్యర్థులపై ముందుగానే బౌన్సర్ విసిరినట్లయ్యింది. సోమవారం హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాల ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించారు. అన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. పటాకులు కాల్చారు. మిఠాయిలు పంచారు.

– సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

బాల్కొండ



అభ్యర్థి పేరు : వేముల ప్రశాంత్ రెడ్డి
గ్రామం:వేల్పూర్
మండలం : బాల్కొండ
తల్లిదండ్రులు : మంజుల, సురేందర్ రెడ్డి
సంతానం : కుమారుడు, కుమార్తె, **విద్యార్హత :** బీఈ (సివిల్)
పుట్టిన తేది : 14-03-1966
రాజకీయ విశేషాలు : 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సమీప అభ్యర్థి సునీల్ రెడ్డిపై 32,408 ఓట్ల ఆధిక్యంతో గెలుపు. ప్రభుత్వంలో రోడ్లు, భవనాలు, గృహనిర్మాణ, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అనిల్‌కుమార్‌పై 36,248 ఓట్ల మెజార్టీతో విజయం. మిషన్ భగీరథ వైస్ చైర్మన్. మలేషియా, సింగపూర్, శ్రీలంక, థాయిలాండ్,యూఏఈ తదితర దేశాల సందర్శన.

ప్రతిపక్షాలకు భంగపాటు తప్పదు

వరుసగా నాలుగోసారి తమ కుటుంబానికి పార్టీ టికెట్ కేటాయించిన అధినేత కేసీఆర్ గారికి ధన్యవాదాలు. నా తండ్రి రైతు నాయకుడు వేముల సురేందర్ రెడ్డికి ఒకసారి, నాకు మూడు సార్లు టికెట్ కేటాయించారు. అధినేత కేసీఆర్ నమ్మకాన్ని నిలబెడుతూ ప్రజాక్షేత్రంలో ఈసారి కూడా విజయం సాధిస్తా. కేసీఆర్ హ్యాట్రిక్ కొట్టడం ఖాయం. ఈ సారి కూడా ప్రతిపక్షాలకు ప్రజాక్షేత్రంలో భంగపాటు తప్పదు.

నిజామాబాద్ రూరల్



అభ్యర్థిపేరు : బాజిరెడ్డి గోవర్ధన్
గ్రామం : చీమన్‌పల్లి, సిరికొండ
తల్లిదండ్రులు : దిగంబర్, శాంతమ్మ
చదువు : బీఏ
పుట్టిన తేదీ : 17-02-1954
పదవులు..

- 1973లో పోలీస్ పటేల్, 1981లో సర్పంచ్, 1987- 1990లో ఎంపీపీ, 1994-2004లో ఆంధ్రప్రదేశ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్, 1994లో ఆర్మూర్ ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. 1999-2004లో ఆర్మూర్ ఎమ్మెల్యేగా, 2004, 2009లో బాన్సువాడ ఎమ్మెల్యేగా, 2014, 2018లో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేగా ఎన్నిక. ప్రస్తుతం ఆర్టీసీ చైర్మన్.

మరోసారి ఆశీర్వదించండి..

రూరల్ ఎమ్మెల్యేగా మూడోసారి గెలిపించి ఆశీర్వదించండి. గత ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించి మీరు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేశాను. నియోజక వర్గంలో ఎంతో అభివృద్ధి చేశా. మిగిలిపోయిన సమస్యలు తర్వాత పాలనలో పరిష్కరించుకుందాం. టికెట్ ఇచ్చిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు.

ఆర్మూర్



పేరు : ఆశన్నగారి జీవన్‌రెడ్డి
స్వస్థలం : జానకంపేట, వేల్పూర్
తల్లిదండ్రులు : రాజాబాయి, వెంకటరాజన్న
పుట్టిన తేదీ : 7-3-1976
విద్యాభ్యాసం : ఎల్ఎల్‌బీ
భార్య : రజితారెడ్డి
సంతానం : ఇద్దరు కూతుళ్లు
రాజకీయ నేపథ్యం : తెలంగాణ ఉద్యమంలో జీవన్‌రెడ్డి కీలకపాత్ర. ఎర్రజొన్న బకాయిల కోసం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంతో పోరాడుతున్న రైతులకు జీవన్‌రెడ్డి బాసటగా నిలిచారు. 2014లో టీఆర్ఎస్ బీఫాంపై కాంగ్రెస్ అభ్యర్థి కేతిరెడ్డి సురేశ్‌రెడ్డిపై గెలుపు. 2018లో టీఆర్ఎస్ తరపున పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి ఆకుల లలితపై 28,795 ఓట్లతో రెండోసారి విజయం. పీయూసీ చైర్మన్‌గా నియామకం. తర్వాత బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియామకం.

కేసీఆర్‌కు పాదాభివందనం..

నాపై ఎంతో నమ్మకంతో ఆర్మూర్ నుంచి మూడోసారి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేసే అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కు పాదాభివందనం. కేసీఆర్ నమ్మకాన్ని నిజం చేస్తూ ఆర్మూర్ ప్రజల ఆశీస్సులతో హ్యాట్రిక్ విజయం సాధిస్తా.

నిజామాబాద్ అర్బన్



అభ్యర్థి : బిగాల గణేశ్ గుప్తా
పుట్టిన తేదీ : 17-4-1970
తల్లిదండ్రులు : సువర్ణమాల, కృష్ణమూర్తి గుప్తా, **భార్య :** లత
సంతానం : ఇద్దరు కూతుర్లు
సోదరుడు: బిగాల మహేశ్
చదువు : బీఈ సివిల్
రాజకీయ ప్రవేశం: 2009లో నిజామాబాద్ ఎంపీగా టీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీచేసి ఓడిపోయారు. 2014లో అర్బన్ నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి తొలి సారి గెలుపొందారు. 2018లో అర్బన్ నుంచి రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపు.

మూడోసారి గులాబీ జెండా ఎగరేస్తాం

నగరంలో చేసిన అభివృద్ధితోపార్టీ క్షేత్రస్థాయిలో బలపడింది. మూడోసారి సీఎం కేసీఆర్ టికెట్ ఇచ్చారు. మూడోసారి గులాబీ జెండాను ఎగురవేస్తాను.

బోధన్



అభ్యర్థి : మహ్మద్ షకీల్
తల్లిదండ్రులు : షగుఫ్తా అదీబ్, మహ్మద్ అజమ్, **భార్య :** అయేషా ఫాతిమా
నివాసం : బోధన్
పుట్టిన తేది : 7-03-1976
విద్యార్హతలు : డిగ్రీ
సంతానం : కొడుకు, 3 కుమార్తెలు
రాజకీయ నేపథ్యం : 2001లో బీజేపీలో రాజకీయ ప్రస్థానం ప్రారంభం. అనంతరం టీడీపీలో చేరిక. నాలుగోసారి ఎమ్మెల్యేగా పోటీ. 2007 టీడీపీ నుంచి ఎమ్మెల్సీకి పోటీ చేసి ఓటమి. 2009లో టీఆర్ఎస్‌లోకి చేరినప్పటికీ సుదర్శన్‌రెడ్డి చేతిలో ఓటమి. 2014, 2018లో ఎమ్మెల్యేగా గెలుపు.

కేసీఆర్ అడుగుజాడల్లో నడుస్తా..

బీఆర్ఎస్ అధినేత సీఎం కేసీఆర్ అడుగుజాడల్లో నడుస్తాను. ప్రజా సేవ, అభివృద్ధికి పునరంకితమవుతాను.

కామారెడ్డి

అభ్యర్థి: కల్వకుంట్ల చంద్రశేఖరరావు
పుట్టిన తేదీ: 17-2-1954
జీవిత భాగస్వామి: శోభ
సంతానం: తారక రామారావు, కవిత
రాజకీయ ప్రస్థానం:

- విద్యార్థి దశలోనే రాజకీయాల్లోకి ప్రవేశించారు.
- 1983లో టీడీపీనుంచి సిద్దిపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు.
- 1985లో సిద్దిపేటనుంచే తొలిసారి శాసనసభకు ఎన్నికయ్యారు. అసెంబ్లీకి 1989, 1994, 1999 గెలిచారు. పలు మంత్రివర్గాలలో మంత్రిగా, డిప్యూటీ స్పీకర్‌గా పనిచేశారు. కేంద్ర మంత్రిగానూ వ్యవహరించారు.
- 2001లో టీడీపీకి, ఎమ్మెల్యే స్థానానికి రాజీనామా చేసి, టీఆర్ఎస్ స్థాపించారు. 2001(ఉప ఎన్నిక)లో గెలుపొందారు. 2004లో కరీంనగర్ ఎంపీగా గెలిచారు. తెలంగాణ కోసం రాజీనామా చేయడంతో 2006, 2008లలో వచ్చిన ఉప ఎన్నికల్లోనూ గెలిచారు. 2009లో మహబూబ్‌నగర్ ఎంపీగా పోటీ చేసి విజయం సాధించారు.
- 2014లో గజ్వేల్ నుంచి గెలిచి సీఎం అయ్యారు. 2018లోనూ ఆయన మరోసారి గెలిచి, ప్రస్తుత ముఖ్యమంత్రిగా ఉన్నారు.

బాన్సువాడ



అభ్యర్థి పేరు: పరిగె(పోచారం) శ్రీనివాస్‌రెడ్డి
పుట్టినతేదీ: 10-02-1949
గ్రామం: పోచారం
మండలం: బాన్సువాడ
తల్లి పేరు: పరిగె పాపమ్మ
తండ్రి పేరు: పరిగె రాజిరెడ్డి
జీవిత భాగస్వామి: పుష్ప
సంతానం: ముగ్గురు కుమారులు, ఒక కూతురు
విద్యార్హతలు: బీఈ(ఎంటెక్)
రాజకీయ ప్రస్థానం: 1976లో రాజకీయాల్లో ప్రవేశం. 1977, 1981లలో దేశాయిపేట సొసైటీ చైర్మన్‌గా, 1987లో బుడ్మి సొసైటీ చైర్మన్‌గా ఎన్నిక. 1994, 1999, 2009, 2011(ఉప ఎన్నిక), 2014, 2019 లలో బాన్సువాడ ఎమ్మెల్యేగా ఎన్నిక. 2004 ఎన్నికలలో ఓటమి. 1998లో గృహనిర్మాణ, 1999లో భూగర్భ గనులు, 2000లో పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా బాధ్యతల నిర్వహణ. 2014 నుంచి 2018 వరకు వ్యవసాయ మంత్రిగా పని చేశారు. 2019నుంచి అసెంబ్లీ స్పీకర్.

జుక్కల్



అభ్యర్థి పేరు: హన్మంత్ సింధే
పుట్టినతేదీ: 14-8-1966
గ్రామం: దోన్‌గావ్
మండలం: జుక్కల్
తల్లి పేరు: నాగమ్మ
తండ్రి పేరు: మహదప్ప
జీవిత భాగస్వామి: శోభావతి
సంతానం: ముగ్గురు కుమారులు
విద్యార్హతలు: బీఈ(సివిల్)
నీటి పారుదల శాఖలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా ఉద్యోగం.
రాజకీయ ప్రస్థానం: 2004లో రాజకీయాల్లోకి రాక. టీడీపీనుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2009 లో టీడీపీ నుంచి పోటీ చేసి గెలుపు. 2013లో బీఆర్ఎస్‌లో చేరిక. 2014, 2018 లలోనూ విజయాలు.
శాసనసభ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ కమిటీ చైర్మన్‌గా, ప్యానెల్ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.

ఎల్లారెడ్డి



అభ్యర్థి: జాజాల సురేందర్
పుట్టినతేదీ: 25-03-1973
గ్రామం: నల్లమడుగు
మండలం: లింగంపేట
తల్లి పేరు: హనుమవ్వ
తండ్రి పేరు: నర్సయ్య
భార్య: భార్గవి
సంతానం: ఇద్దరు కుమారులు
విద్యార్హతలు : బీకాం
రాజకీయ ప్రస్థానం: 2001లో టీఆర్ఎస్ ద్వారా రాజకీయ ప్రవేశం. 2004లో టీఆర్ఎస్ టికెట్టు దక్కకపోవడంతో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి ఓడిపోయారు. 2008, 2010 ఉప ఎన్నికలలో టీడీపీ నుంచి, 2014లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓటమి. 2009లో పోటీకి దూరంగా ఉన్నారు. 2018లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి తొలిసారి గెలుపు. అనంతరం అధికార పార్టీలో చేరిక.



బీఆర్ఎస్‌లో నూతనోత్తేజం

బీఆర్ఎస్ సంబురాలు అంబరాన్నంటాయి. అన్ని నియోజకవర్గాల్లోనూ సిట్టింగ్‌లకే టికెట్లివ్వడంతో కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

అర్బన్ కాంగ్రెస్ టికెట్‌కు ముగ్గురి దరఖాస్తు

ఖలీల్‌వాడి : నిజామాబాద్ అర్బన్ కాంగ్రెస్ టికెట్ కోసం హైదరాబాద్‌లో నిగాంధీభవన్‌లో ముగ్గురు దరఖాస్తు చేసుకున్నారు. టీపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్, నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేశ వేణు, మాజీ మేయర్, సీనియర్ కాంగ్రెస్ నేత ధర్మపురి సంజయ్ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. సంజయ్ అనుచరులు గాంధీభవన్‌లో దరఖాస్తు చేసినట్లు సమాచారం. ఆర్మూర్ నుంచి మార చంద్రమోహన్,రూరల్ నుంచి మాజీ ఎమ్మెల్సీ భూపతి రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నగేశ్ రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు.బాల్కొండ,బోధన్,బాన్సువాడ కోసం ఎవరూ దరఖాస్తు చేయలేదు.

ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల

- మొత్తం 13,21,090 ఓటర్లు
- అక్టోబర్ 4న తుది జాబితా!

సుభాష్‌నగర్: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం సోమవారం ఓటర్ల ముసాయిదా జాబితాను విడుదల చేసింది. కొన్ని రోజులుగా మార్పులు, చేర్పులు, నమోదు చేసుకున్న వారికి ఓటు హ క్కు కల్పించేందుకు కసరత్తు చేశారు. జాబితాలో తప్పులు లేకుండా చూడాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసిన విషయంతెలిసిందే. స్పెషల్ సమ్మరీ రివిజన్(ఎస్ఎస్ఆర్)-2023 ప్రణాళిక ప్రకారం అధికారులు ఓటరు జాబితాను పకడ్బందీగా తయారుచేశారు. జిల్లావ్యాప్తంగా 1,549 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 13,21,090 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 6,25,677 మంది పురుషులు, 6,95,356 మహిళలు, 57 మంది ఇతరులు ఉన్నారు. జిల్లాలోని ఆరు సెగ్మెంట్లకు సంబంధించిన జాబితాలో ఓటర్లు నమోదై ఉన్నారు. బాన్సువాడలో కొన్ని మండలాలు నిజామాబాద్ జిల్లా పరిధిలో ఉ న్నాయి. ఓటరు జాబితాలో పేర్లు ఉన్న వారు ఆధార్‌ను అనుసంధానం చేసుకునే అవకాశముంది. ముసాయిదా ఓటర్ల జాబితాలో అభ్యంతరాలుంటే సెప్టెంబర్ 19వరకు తహసీల్దార్ కార్యాలయాల్లో ఫిర్యాదులు అందించాలి. మండల, గ్రామాల వారీగా వివరాలను తహసీల్దార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచారు. అభ్యంతరాల ప్రక్రియ పూర్తయిన తర్వాత ఓటరు జాబితాలో ఉన్న పొరపాట్లను అక్టోబర్ 1న పరిశీలిస్తారు. ఈనెల 26, 27 తేదీల్లో ప్రత్యేక ఓటు నమోదుకు అవకాశం కల్పించారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ స్టేషన్లు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
ఆర్మూర్	217	94,407	1,07,440	6	2,01,853
బోధన్	246	99,782	1,08,139	5	2,07,926
బాన్సువాడ	258	89,793	97,668	8	1,87,469
నిజామాబాద్అర్బన్	289	1,32,933	1,41,408	31	2,74,372
నిజామాబాద్ రూరల్	293	1,12,518	1,28,529	4	2,41,051
బాల్కొండ	246	96,244	1,12,172	3	2,08,419
మొత్తం	1,549	6,25,677	6,95,356	57	13,21,090



కలెక్టరేట్‌లో జాబితాను పరిశీలిస్తున్న సిబ్బంది

క్లుప్తంగా

పీజీ పరీక్షల రీషెడ్యూల్

తెయూ(డిచ్‌పల్లి): ప్రభుత్వం గ్రూప్–2 పరీక్షలు వాయిదా వేయడంతో తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పీజీ పరీక్షలను రీ షెడ్యూల్ చేసినట్లు కంట్రోలర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ ఎంఏ, ఎంఎస్సీ, ఎంకాం, ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులు అప్లయిడ్ ఎకనామిక్స్, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ, ఐఎంబీఏ 4వ సెమిస్టర్ రెగ్యులర్/బ్యాక్‌లాగ్ పరీక్షలు ఈ నెల 31న జరగాల్సి ఉండగా 29వ తేదీకి, సెప్టెంబర్ 2న జరగాల్సిన పరీక్షను ఈ నెల 31కి ప్రీపోన్ చేసినట్లు తెలిపారు.

నూతన జీపీలను ఏర్పాటు చేయాలని వినతి



డిచ్‌పల్లి: రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ హైద రాబాద్‌లో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రూరల్ నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో గ్రామ పంచాయతీలకు అనుసంధానంగా ఉన్న గాంధీనగర్, ఇందిరానగర్, సంతోష్ నగర్, జింగ్యాల తండా, మెట్టుమర్రి తండా, నడిమి తండా, సాయినగర్, చింతల్‌తండాల్లో జనాభాను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక పంచాయతీలుగా మార్చాలని విజ్ఞప్తి చేశారు. ఇందల్వాయి మండలంలోని మల్లాపూర్‌ను డిచ్‌పల్లి మండలంలో చేర్చాలని కోరారు.

మెప్మా పీడీగా రాజేందర్

నిజామాబాద్ నాగారం: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పీడీగా రాజేందర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వేల్పూర్ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన రాజేందర్ ఆర్డీవోగా ఉద్యోగోన్నతి పొందడంతో మెప్మా పీడీగా బాధ్యతలు చేపట్టారు. అధికారులు, ఉద్యోగులు పీడీకి శుభాకాంక్షలు తెలిపారు.

చెట్టును ఢీకొన్న కారు

తాడ్వాయి: తాడ్వాయిలో సోమవారం ఉదయం కారు చెట్టును ఢీకొంది. మండలంలోని చిట్యాలకు చెందిన కుమార్ కారులో కామారెడ్డి నుంచి వస్తుండగా అదుపుతప్పి తాడ్వాయి పాత బస్టాండ్ పక్కన చెట్టును ఢీకొంది. ప్రమాదంలో కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల

సుభాష్‌నగర్ : కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు సోమవారం విడుదల చేసింది. జిల్లావ్యాప్తంగా 530 జీపీలకు రూ.14.02 కోట్లు విడుదలయ్యాయి. జనాభా ప్రాతిపదికన ప్రభుత్వం నిధులను విడుదల చేస్తోంది. ఈ నిధులు మూడు, నాలుగు రోజుల్లో పంచాయతీ ఖాతాల్లో జమ కానున్నాయి.

‘లక్కు’ చిక్కింది..

- 102 వైన్స్‌లకు ముగిసిన లక్కీ డ్రా
- డ్రా తీసిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



మద్యం దుకాణాలకు డ్రా తీస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

ఖలీల్‌వాడి : కొత్త మద్యం పాలసీలో 2023–2025కు గాను జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో సోమవారం లక్కీడ్రా ముగిసింది. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు డ్రా తీసి విజేతలను ప్రకటించారు. జిల్లాలో 102 మద్యం దుకాణాలకు సంబంధించి ఈనెల 4వ తేదీ నుంచి 18వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించారు. సోమవారం లక్కీ డ్రా తీశారు. జిల్లాలోని 102 మద్యం షాపులకు 3,759 దరఖాస్తులు దాఖలయ్యాయి. దరఖాస్తుల రూపంలో రూ.75.18 కోట్ల ఆదాయం వచ్చింది. జిల్లాలో అత్యధికంగా మానిక్‌బండార్ మద్యం దుకాణానికి 112 దరఖాస్తులు, మోపాల్‌లో 102, ఏర్గట్లలో 104 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 19 దుకాణాలు మహిళలకు దక్కాయి. అత్యధిక దరఖాస్తులు వచ్చిన మానిక్‌బండార్ వైన్స్ మౌనికకు, మోపాల్ వైన్స్ చిట్యాల సాన్వికి వచ్చింది. దరఖాస్తుదారులను వేదిక పైకి ఆహ్వానిస్తూ, వారి సమక్షంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు లక్కీ డ్రా తీసి, డ్రాలో వచ్చిన వారి వివరాలను ప్రకటించారు. వైన్‌షాపులకు వచ్చిన దరఖాస్తుదారుల టోకెన్ నంబర్‌ను అందరికి చూపించి లక్కీ డ్రాలో వేసి తీశారు. లక్కీ డ్రాలో దరఖాస్తుదారులకు ఇబ్బందులు కలుగకుండా వీడియో, ఫొటోలు తీయించారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ్, సహాయ కమిషనర్ కిషన్, ఇతర అధికారుల పర్యవేక్షణలో లక్కీ డ్రా ప్రశాంతంగా ముగిసింది.

సౌకర్యాల్లేక ఇబ్బందులు..

రాజీవ్‌గాంధీ ఆడిటోరియానికి సుమారు 3,500 మంది దరఖాస్తుదారులు వచ్చారు. వారికి టెంట్లు గాని మంచినీటి సౌకర్యం లేకపోవడంతో ఎండలోనే గంటల కొద్ది వేచి ఉండాల్సి వచ్చింది. వాహనాలు నిలపడానికి ఎలాంటి వసతులు లేక రోడ్డు పైనే నిలపాల్సి వచ్చింది. ఖలీల్‌వాడి ప్రాంతంలో హాస్పిటల్స్‌కు వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉండటంతోపాటు దరఖాస్తుదారులు రావడంతో కాలనీలో రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.



ఆడిటోరియం వద్ద దరఖాస్తుదారుల సందడి

మొదట 1/6 వంతు లైసెన్స్ ఫీజు..

జిల్లాలోని 102 మద్యం దుకాణాలు దక్కించుకున్న వారు సోమవారం, మంగళవారం 1/6 వంతు లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. జిల్లాలో మూడు రకాల దుకాణాలు జనాభా ప్రతిపాదిక ఏర్పాటు చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి తెలిపారు. రూ. 65 లక్షల జనాభా ఉన్న ఏరియా పరిధిలో ఉన్న వైన్స్‌కు దరఖాస్తుదారులు రూ.13.50 లక్షలు, రూ.55 లక్షల జనాభా ఉన్న పరిధిలోని దుకాణాలకు రూ. 10 లక్షలు, 50 లక్షలు జనాభా ఉన్న వైన్స్‌కు రూ.9.17 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. జిల్లాలో 1/6 చెల్లించే ఆదాయం రూ. 9.83 కోట్లు వస్తుందని అధికారులు పేర్కొన్నారు. డిసెంబర్ 1వ తేదీ నుంచి కొత్త దుకాణాలు కొనసాగుతాయన్నారు. లైసెన్స్ ఫీజు నిర్ణీత గడువులోపు చెల్లింపు కోసం ప్రత్యేకంగా రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో కౌంటర్ ఏర్పాటు చేశారు. మంగళవారం సాయంత్రం వరకు చెల్లించకపోతే లైసెన్స్‌ను రద్దు చేస్తామని స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంతో పాటు పరిసర ప్రాంతాల్లోనూ కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

బాలికకు పాముకాటు

చికిత్స కోసం సాయం కోరుతున్న తల్లిదండ్రులు



చాకలి లక్ష్మి(ఫైల్)

నాగిరెడ్డిపేట: మండలంలోని నాగిరెడ్డిపేట గ్రామానికి చెందిన చాకలి అలియాస్ కిచ్చమొల్ల లక్ష్మి పాముకాటుకు గురైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. లక్ష్మి ఇంట్లో నిద్రిస్తుండగా శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత వాంతులు చేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే గోపాల్‌పేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించి ఇంటికి తీసుకెళ్లారు. ఆదివారం ఉదయం మళ్లీ అస్వస్థతకు గురవడంతో కటుంబసభ్యులు మళ్లీ ఆస్పత్రికి తీసుకొచ్చారు. లక్ష్మి ఆరోగ్య పరిస్థితిని గమనించి ఆమె పాముకాటుకు గురైందని గుర్తించి వెంటనే మెదక్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం లక్ష్మి మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఆమె పరిస్థితి విషమంగా ఉంది. బాలిక తల్లిదండ్రులు పోచయ్య, విజయ కూలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తారు. దీంతో వైద్యానికి డబ్బులు లేక దాతల సాయం కోరుతున్నారు. దాతలు స్పందించి తమ కూతురును ఆదుకోవాలని కోరుతున్నారు.

ఆర్థిక సాయం చేయాల్సిన వివరాలు..
9553795811(గూగుల్ పే)
కిచ్చమొల్ల రవికుమార్

ప్రజావాణికి 111 ఫిర్యాదులు

సుభాష్‌నగర్: ప్రజావాణికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ యాదిరెడ్డి అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 111 ఫిర్యాదులు అందాయి. అదనపు కలెక్టర్ యాదిరెడ్డితోపాటు, డీఆర్‌డీవో చందర్, డీపీవో జయసుధ ఫిర్యాదులు స్వీకరించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

వేల్పూర్, మోర్తాడ్, బాల్కొండ, వర్ని మండలాలకు చెందిన 9, 10 తరగతులకు సంబంధించి మధ్యాహ్న భోజనం పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి చక్రపాణి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఓమయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. కార్మికులు లక్ష్మి, వరలక్ష్మి, లలిత పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ యాదిరెడ్డి

దళిత విద్యార్థినికి దక్కని న్యాయం

సెటిల్‌మెంట్ చేసుకోవాలన్న విద్యాధికారి!



ఆందోళన చేస్తున్న దళిత సంఘాల నాయకులు

నిజామాబాద్‌అర్బన్: బీబీసీ పాఠశాల ఘటనలో దళిత విద్యార్థినికి న్యాయం జరగడం లేదు. పాఠశాలలో జరిగిన ఘటనకు సంబంధించి ఇటు విద్యాశాఖ, అటు పోలీస్‌శాఖ సరైన రీతిలో స్పందించడం లేదు. న్యాయం చేయాల్సిన అధికారులు గొడవ ఎందుకు సెటిల్‌మెంట్ చేసుకోవాలని చెబుతున్నారు. నాలుగు రోజుల క్రితం పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థినిని పాఠశాల చైర్మన్ ప్రవీణ్ ఫీజు కట్టలేదంటూ బైక్‌పై ఎంఈవో కార్యాలయానికి, ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లారు. దారిమధ్యలో విద్యార్థినిని రెండు సార్లు కొట్టాడు. దీంతో విద్యార్థిని తల్లి అదే రోజు ఐదో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సోమవారం ఈ ఘటనకు సంబంధించి విద్యాశాఖ తరపున శంకర్ అనే ప్రధానోపాధ్యాయుడు విద్యార్థినిని ఎంఈవో కార్యాలయంలో విచారించారు. అనంతరం అక్కడే ఉన్న ఓ విద్యాధికారి ఈ గొడవ ఎందుకు, పాఠశాల యజమానితో సెటిల్‌మెంట్ చేసుకోవాలని బాధితురాలికి సూచించాడు. ఫీజు చెల్లించలేదని విద్యార్థినిని బయటకు తీసుకెళ్లిన పాఠశాల యజమానిపై చర్యలు తీసుకోవాల్సింది పోయి సదరు విద్యాధికారి ఈ విధంగా మాట్లాడడం చర్చనీయాంశంగా మారింది. మరో విద్యాధికారి విద్యార్థినిని యజమాని బయటకు తీసుకెళ్లడానికి కారణాలు ఉన్నాయని బాధిత కుటుంబంతో చెప్పినట్లు తెలిసింది. దీంతో విద్యాశాఖ అధికారులు పాఠశాల యజమానికే ఒత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో పోలీసులు సైతం సరైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేయలేదనే ఆరోపణలు ఉన్నాయి. కేసు నమోదులో ఓ ఎమ్మెల్యే అనుచరుడు పాఠశాల యజమానికి మద్దతు పలుకుతు తప్పించే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు బీబీసీ ఘటనలో విద్యార్థి సంఘాలు స్పందించడం లేదు.

దళిత సంఘాల నిరసన

బీబీసీ పాఠశాల ఎదుట పలు దళిత సంఘాల నాయకులు సోమవారం నిరసన చేపట్టారు. పాఠశాల యజమానిపై చర్యలు తీసుకోవాలని, పాఠశాలపై విద్యాశాఖ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తలవంచిన పేదరికం

- ‘కిలిమంజారో’ అధిరోహించిన నాళేశ్వర్ యువకుడు
- ఉద్యోగం చేస్తూనే పర్వతారోహణ



కిలిమంజారో పర్వతంపై త్రివర్ణ పతాకంతో ఆర్మూర్ మారుతి

నవీపేట: ఆ యువకుడి ఆత్మస్థైర్యం ముందు పేదరికం తలవంచింది. పర్వతారోహణపై మక్కువతో ఉద్యోగం చేస్తూనే లక్ష్యాన్ని చేరుకున్నాడు. మండలంలోని నాళేశ్వర్ గ్రామానికి చెందిన ఆర్మూర్ మారుతి కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించాడు. మారుతి తండ్రి చిన్నగంగారామ్ రైతు, తల్లి సరోజ బీడీ కార్మికురాలు. పేద కుటుంబంలో నుంచి వచ్చిన మారుతి చిన్నతనం నుంచే చదువు లో చురుగ్గా ఉండేవాడు. గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివి 9.8 జీపీఏ సాధించాడు. దీంతో బాసర ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. 2020లో చదువు పూర్తి చేసుకున్న మారుతి 2021 నవంబర్‌లో ఓ కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. ఉద్యోగం చేస్తూనే పర్వతారోహణపై మక్కువ పెంచుకున్నాడు. 2015లో ఎవరెస్ట్ అధిరోహించిన మలావత్ పూర్ణను స్ఫూర్తిగా తీసుకొని శిఖరాలు ఎక్కాలని నిర్ణయించుకున్నాడు. సెలవులు దొరికినప్పుడల్లా కొండలను ఎక్కుతూ మురిసిపోయాడు. రూ.5 వేల ఫీజు చెల్లించి భువనగిరి ఫోర్ట్‌లో బేసిక్ పరిజ్ఞానాన్ని పొందాడు. ట్రిపుల్ ఐటీలో సెలవులు వస్తే అందరు విద్యార్థులు సొంతూళ్లకు వెళ్తే మారుతి మాత్రం భువనగిరి వెళ్లేవాడు. కొడుకు జిజ్ఞాసను అర్థం చేసుకున్న తల్లిదండ్రులు ప్రోత్సహించారు. అక్కడ శిక్షణ పొందిన మారుతికి రెండేళ్ల క్రితం పశ్చిమ బెంగాల్‌లోని మౌంట్ రణాక్ పర్వతాలను అధిరోహించేందుకు అనుమతి వచ్చింది. అక్కడికి వెళ్లాలంటే కనీసం రూ.4 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పడంతో నిరాశకు గురయ్యాడు. చేతిలో చిల్లిగవ్వలేకపోవడంతో ముందుకు వెళ్లలేదు.

అప్పు చేసి..

పర్వతారోహణే లక్ష్యంగా ఎంచుకున్న మారుతి ఆర్థిక భారాన్ని లెక్కచేయలేదు. ఈ క్రమంలో సౌత్ ఆఫ్రికాలోని కిలిమంజారో ఎక్కే అవకాశం వచ్చింది. ఈ సారి ఎలాగైన వెళ్లాలని నిశ్చయించుకున్నాడు. చేతిలో డబ్బులు లేకపోవడంతో అయినవారి సహాయం కోరాడు. మారుతి తపనను అర్థం చేసుకున్న బంధువులు, మిత్రులు రూ.4 లక్షల అప్పు ఇచ్చి ప్రోత్సహించారు. ఈ నెల 8న సౌత్ ఆఫ్రికా బయలుదేరిన మారుతి 10న పర్వతారోహణకు సిద్ధమయ్యాడు. 5895 మీటర్ల ఎత్తైన కిలిమంజారో పర్వతంపైకి 15న చేరుకుని దేశ త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించాడు.

అభినందించిన ఎమ్మెల్యే



బోధన్: కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన మారుతిని సోమవారం బోధన్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ అభినందించారు. ఎత్తైన పర్వతాన్ని అధిరోహించి రాష్ట్రానికి ఖ్యాతి తెచ్చాడని కొనియాడారు. ప్రోత్సాహకంగా రూ.51 వేల నగదు అందించారు.

ఎవరెస్ట్ అధిరోహిస్తాను



చిన్నప్పటి నుంచి కొండలు, గుట్టలు ఎక్కడం అంటే చాలా ఇష్టం. ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన మలావత్ పూర్ణను ఆదర్శంగా తీసుకుని చిన్న చిన్న కొండలను ఎక్కాను. కిలిమంజారో ఎక్కడం ఆనందంగా ఉంది. దాతలు సహకరిస్తే ఎవరెస్ట్ పర్వతాలను అధిరోహిస్తా.

– ఆర్మూర్ మారుతి

నాడు బ్రిగేడియర్‌గా కేసీఆర్

సాక్షి, కామారెడ్డి : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమాన్ని మొదలుపెట్టిన తొలినాళ్లలో సీఎం కేసీఆర్ కామారెడ్డి ప్రాంతం మీద ఎక్కువ ఫోకస్ చేశారు. అప్పట్లో మండలానికో బ్రిగేడియర్‌ను నియమించి ఆ మండలంలో పూర్తి స్థాయిలో గులాబీ సైన్యాన్ని తయారు చేయడం, ఉద్యమాన్ని ఉధృతం చేయడానికి యత్నించారు. అందులో భాగంగా కేసీఆర్ కామారెడ్డి బ్రిగేడియర్‌గా పనిచేశారు. బహిరంగ సభల కోసం డబ్బులు సమీకరించడానికి కూలి పనులు చేశారు. 2001లో వచ్చిన స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గంలో మెజారిటీ ఎంపీపీలను టీఆర్‌ఎస్ గెలుచుకుంది. అదే సమయంలో ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని కైవసం చేసుకుంది. ఉద్యమ నేతగా ఎన్నోసార్లు కామారెడ్డి నియోజకవర్గంలో తిరిగిన కేసీఆర్.. సీఎం అయ్యాక కూడా పలు సభల్లో పాల్గొన్నారు. సీఎం కేసీఆర్ కామారెడ్డి నుంచి పోటీ చేయనుండడంతో ఈ ప్రాంత ప్రజల్లో ఎన్నో ఆశలు పెరిగాయి. సీఎం పోటీ చేస్తే ఈ ప్రాంత అభివృద్ధికి కృషి జరుగుతుందని ప్రజలు ఆశిస్తున్నారు.

వృద్ధులకు లాయర్లను ఏర్పాటు చేస్తాం

సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి

ఖలీల్‌వాడి: వృద్ధాప్యంలో పిల్లల ద్వారా ఇబ్బందులు ఎదుర్కొనే వారికి న్యాయ సహాయం కోసం లాయర్లను ఏర్పాటు చేస్తామని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి పద్మావతి అన్నారు. వృద్ధుల దినోత్సవం సందర్భంగా నగరంలోని సుభాష్‌నగర్‌లో సీనియర్ సిటిజన్స్ సభ్యులు సమావేశం నిర్వహించారు. వృద్ధ తల్లిదండ్రులను పిల్లలు ప్రేమతో చూసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి రసూల్‌బీ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవీదాస్ చందర్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు భూమన్న, మామిండ్ల రాజేందర్, ఆలన వృద్ధాశ్రమం వ్యవస్థాపకుడు రాజారెడ్డి తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సదాశివనగర్: మండలంలోని మర్కల్ సమీపంలోని సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ గురుకుల కళాశాలలో కామర్స్ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ రాధిక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థులు ఈనెల 24న కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

28న నిధి ఆప్కే నికట్

నిజామాబాద్ సిటీ: ఈ నెలా 28న మోర్తాడ్, కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం నస్రుల్లాబాద్‌లో నిధి ఆప్కే నికట్ 2.0 కార్యక్రమం నిర్వహించనున్నట్లు పీఎఫ్ సహాయ కమిషనర్ బి మధుసూదనాచారి ఒక ప్రకటనలో తెలిపారు. మోర్తాడ్‌లో కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఎన్‌ఫోర్సుమెంట్ అధికారి శ్రవణ్‌కుమార్, నస్రుల్లాబాద్‌లో వెంకటసాయి విద్యానికేతన్‌లో ఎన్‌ఫోర్సుమెంట్ అధికారి ఎస్ శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. పీఎఫ్ చందాదారులు, యజమానులు, పెన్షనర్లు తగిన ఆధారాలతో నిధి ఆప్కే నికట్ 2.0కు హాజరు కావాలని, ఫిర్యాదులు అక్కడికక్కడే పరిష్కరిస్తామని సహాయ కమిషనర్ మధుసూదనాచారి తెలిపారు.

కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలి



ధర్నాచౌక్‌లో ధర్నా చేస్తున్న ఏఎన్ఎంలు

ఖలీల్‌వాడి: కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. నగరంలో ఏఎన్ఎంలు చేపట్టిన సమ్మె సోమవారం ఏడో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా ధర్నాచౌక్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్, సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వం స్పందించి ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పుష్ప, గంగజమున, కవిత, సుజాత నాగలక్ష్మి పాల్గొన్నారు.

మేనమామపై కత్తితో దాడి

భిక్కనూరు: మేనమామపై అల్లుడు దాడి చేసిన ఘటన మండలంలోని పెద్దమల్లారెడ్డిలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మంద శ్రీనివాస్ తన సోదరి మృతి చెందడంతో ఆమె కుమారుడు పోలు రాజును పెంచి పెద్దచేశాడు. వారం రోజులుగా రాజు అకారణంగా మేనమామ శ్రీనివాస్‌తో గొడవ పడుతున్నాడు. సోమవారం సాయంత్రం ఇంటి ముందు కూర్చున్న శ్రీనివాస్ వద్దకు రాజు వచ్చి స్థలం కాగితాలు ఇవ్వమని కత్తితో బెదిరించాడు. ఏ స్థలం ఏమి కాగితాలు అన్ని అడుగుతుండగానే కత్తితో శ్రీనివాస్ వీపు పై మూడు సార్లు పొడిచాడు. శ్రీనివాస్ కేకలు వేయడంతో రాజు పారిపోయాడు. స్థానికులు శ్రీనివాస్‌ను చికిత్స నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై బాధితుడి ఫిర్యాదు మేరకు రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ వివరించారు.

సారంగాపూర్ ఫ్యాక్టరీని పాలకవర్గానికి అప్పగించాలి



సుభాష్‌నగర్: నిజామాబాద్ సహకార చక్కెర కర్మాగారాన్ని రైతు పాలకవర్గానికి అప్పగించాలని భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ కార్యదర్శి సాయిరెడ్డి డిమాండ్‌చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ యాదిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆక్రమణల నుంచి ఫ్యాక్టరీ భూమిని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, సూర్యారెడ్డి, సాయిరెడ్డి, కొండా ఆశన్న, రామ్మోహన్, రైతులు, సభ్యులు పాల్గొన్నారు.


హైందవ ధర్మాన్ని భావితరాలకు అందించాలి



రెంజల్: పాశ్చాత్య సంస్కృతి మోజులో పడి యువత హైందవ ధర్మాన్ని విడనాడుతున్నారని, భావితరాలకు మన దేశ సంస్కృతి, సాంప్రదాయాలు, ఆధ్యాత్మికతను అందించాల్సిన అవసరం ఉందని పండరీపూర్ ఎమ్మెల్యే సమాధాన్ మహాదేవ్ అన్నారు. సోమవారం కందకుర్తి పుష్కరక్షేత్రంలో నిర్వహించిన గంగా హారతి కార్యక్రమానికి వచ్చిన ఆయన మాట్లాడారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ప్రశాంతత లభిస్తుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు మంచి నడవడికను నేర్పించాలని సూచించారు. గ్రామంలోని హనుమాన్ ఆలయం నుంచి పుష్కర క్షేత్రం వరకు భక్తులు మంగళహారతులతో పాదయాత్రగా తరలివచ్చారు. బీజేపీ నాయకులు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, వడ్డి మోహన్‌రెడ్డి, అజయ్ వడియార్, కృష్ణమోహన్, నర్సింహారెడ్డి, గోవింద్, రమేశ్‌తో పాటు 500 మంది మహిళలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చెరువులో పడి ఒకరి మృతి



రాజు (ఫైల్)

పిట్లం: చెరువులో పడి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని కంభపూర్‌లో చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన రాజు(30)కి మూడు నెలల క్రితం పెళ్లి అయింది. రాజు ఆదివారం బ్రాహ్మణకుంట చెరువు వద్దకు బహిర్భూమికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లభించలేదు. కాగా సోమవారం చెరువులో రాజు మృతదేహం తేలింది. బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు రాజు చెరువులో పడి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

రైలు కిందపడి ఒకరి ఆత్మహత్య

కామారెడ్డి క్రైం: కామారెడ్డికి సమీపంలోని రంగంపేట గ్రామం వద్ద రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సోమవారం సాయంత్రం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. రామారెడ్డి మండలం ఇస్రోజీవాడి గ్రామానికి చెందిన మచ్చ రాజ్‌కుమార్ (30) కూలీ పని చేసుకునేవాడు. అతనికి రెండు సంవత్సరాల క్రితం భార్యతో విడాకులు అయ్యాయి. అప్పటినుంచి మద్యానికి బానిస అయ్యాడు. ఇంట్లోని కుటుంబ సభ్యులతో తరచూ గొడవ పడేవాడు. సోమవారం గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కామారెడ్డి రైల్వే పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై తావునాయక్ తెలిపారు.

కానిస్టేబుల్ ఇంట్లో దొంగతనం

ఖలీల్‌వాడి: నగరంలోని నాలుగో టౌన్ పరిధిలో రోటరీ నగర్‌లోని వివేకానందనగర్‌కు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ దత్తు ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. దత్తు 13న మహారాష్ట్ర వెళ్లాడు. సోమవారం తిరిగి వచ్చే సరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా తులం బంగారం, 20 తులాల వెండి చోరీ అయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జూనియర్ అసిస్టెంట్‌లో ఇంట్లో..

నగరంలోని న్యాల్‌కల్ రోడ్ రోటరీ నగర్ కాలనీలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. కాలనీకి చెందిన హేమంత్ ఆర్మూర్‌లో ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కుటుంబ సభ్యులతో ఆదివారం రాత్రి ఎల్లమ్మగుట్టకు వెళ్లాడు. సోమవారం ఉదయం వచ్చే సరికి ఇంటి తాళాలు పగుల గొట్టి ఉన్నాయి. బీరువాలోని 25 తులాల బంగారు నగలు, 35 తులాల వెండి చోరీ అయినట్లు బాధితుడు తెలిపారు.

వివాహిత బలవన్మరణం

నస్రుల్లాబాద్: మండల కేంద్రానికి చెందిన ఎరుకలి యశోద(40) మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. యశోద ప్రతి రోజు ఇంట్లో గొడవ పడేది. ఈ క్రమంలో సోమవారం మద్యం మత్తులో భర్త, పిల్లలతో గొడవ పడి ఇంట్లోకి వెళ్లి గడియ పెట్టుకుంది. ఎంతసేపటికి బయటకు రాకపోవడంతో భర్త ఎల్లయ్య తలుపులు బద్దలు కొట్టి చూడగా ఉరి వేసుకుంది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బోరు మోటారు చోరీ

లింగంపేట: లింగంపేటకు చెందిన లింగాల సాయిలు బోరు బావి నుంచి మోటారు, కేబుల్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. గ్రామ సమీపంలోని కట్టు కాలువ పక్కన పంట చేను వద్ద ఏర్పాటు చేసిన బోరుబావి నుంచి శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. మోటారు విలువ రూ.18,000 ఉన్నట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.